క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: దేవరపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని పల్లంట్ల, గౌరీపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. అదే వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 8.30 గంటల వరకు, మిగిలిన త్రిఫేజ్ సరఫరాను మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇవ్వనున్నట్టు తెలిపారు. గౌరీపట్నం పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు.

నిడదవోలు రూరల్‌లో...

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల, కోరుమామిడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిమళ్ల, కోరుమామిడి పరిధిలోని పరిశ్రమలు, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

దేవరపల్లి: పల్లంట్లలో ఉన్న రాజరాజేశ్వరి సమేత దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు వై.సుజన శర్మ, వేదపండితులు స్వామి వారికి అభిషేకం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు స్వామి వారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కూచిపూడి సతీష్ తెలిపారు. మొక్కపాటి శ్రీనివాసరావు దంపతులు, రామకృష్ణ శర్మ దంపతులు, ఎం. బ్రహ్మాజీ దంపతులు, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్యపై దృష్టి సారించాలి

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో చెత్తతో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు మున్సిపల్ పాలకవర్గం దృష్టి సారించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. గురువారం ఆమె పట్టణంలో పర్యటించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయానికి మొదటిసారిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ వాడకంతో విద్యుత్ వినియోగదారులకు కొంత ఊరట లభిస్తోందన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఎంపీ పురందేశ్వరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే వజీరుద్దీన్, జనసేన నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. పట్టణంలో వేంకటేశ్వర కల్యాణ మండపంలో బీజేపీ పట్టణ, నిడదవోలు మండల అధికారుల కమిటీలు, బూత్ కమిటీల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ అంశాలను సమీక్షించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



విద్యార్థి మిత్ర కిట్ల వివరాలను వెల్లడిస్తున్న ఎంఈఓలు తిరుమలదాస్, అప్పారావు

దేవరపల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేసినట్టు మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమల దాస్, కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. దేవరపల్లి మండలంలో 2024–25 విద్యా సంవత్సరంలో 45 పాఠశాలల్లో 4841 మంది విద్యార్థులు ఉన్నారని, అందరికీ కిట్లు అందజేశామన్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూస్, బ్యాగులు, యూనిఫాం, వర్క్ బుక్స్ బెల్టులు అందించామన్నారు. మండలానికి 19,326 పాఠ్యపుస్తకాలు, 5218 వర్క్‌బుక్స్, 4818 మంది విద్యార్థులకు యూనిఫాం, 3129 మంది బెల్టులు, 31,160 నోట్ పుస్తకాలు, 4914 మందికి షూస్ పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు.

115 మంది ఉపాధ్యాయుల చేరిక

ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా దేవరపల్లి మండలానికి వివిధ మండలాల నుంచి 115 మంది ఉపాధ్యాయులు బదిలీపై వచ్చి విధుల్లో చేరినట్టు ఎంఈఓ తిరుమల దాస్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 43 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు గాను 10 మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వివిధ పాఠశాలల్లో విధుల్లో చేరినట్టు ఎంఈఓలు తిరుమలదాస్, అప్పారావు తెలిపారు. పాఠశాలల్లో రీ ఆర్గనైజేషన్‌లో భాగంగా ఈ మార్పులు జరిగినట్టు చెప్పారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీల్లో 56 మందికి గాను 62 మంది నూతనంగా వివిధ పాఠశాలల్లో చేరినట్టు తిరుమలదాస్ తెలిపారు. ఉపాధ్యాయ పోస్టులు పెరిగినందున మరొక 9 మంది ఉపాధ్యాయులు మండలంలో అవసరం ఉన్నట్టు ఆయన చెప్పారు.

రహదారుణం

- అధ్వానంగా మారిన ఏటిగట్టు
- ఇసుక లారీలు, మట్టి ట్రాక్టర్లతో ఇబ్బంది
- పూర్తిగా ధ్వంసమైన రోడ్డు
- ఇబ్బంది పడుతున్న లంక ప్రాంత రైతులు
- పట్టించుకోని అధికారులు



ముక్కామల వద్ద ఏటిగట్టుపై ఉన్న గోతులు



మల్లేశ్వరం వద్ద గోతులు పడి మట్టి పైకి లేచిన ఏటిగట్టు



తీపర్రు వద్ద గోతులు పడిన ఏటిగట్టు



ముత్యాలవారిపాలెం వద్ద కాలువలా కనిపిస్తున్న ఏటిగట్టు

పెరవలి: ఏటిగట్టు రోడ్డు అధ్వానంగా తయారయ్యాయి. ఉచిత ఇసుక విధానం కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. వాహనాలు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగించడంతో గోతులు ఏర్పడి మెటల్ రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారిపోయింది. అడుగేస్తే జారేలా, నడవడానికి వీలులేనంతగా మారింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఏటిగట్టు కురిసిన కొద్దిపాటి వర్షానికి మడుగుల్లా మారిపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో రోడ్డు పాడైపోయి గోతులు పడి రాళ్లు పైకి లేచిపోయి ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. గోతులు, రాళ్ల వలన నిత్యం లంకలోకి వచ్చే రైతులు కూలీలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.

ఎక్కువ బరువు లోడుతో..

ఏటిగట్టుపై కేవలం 5 టన్నులు బరువు కలిగిన వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించాలని నిబంధనలు ఉన్నాయి. వాటిని ఎవరూ పట్టించుకోకుండా 40 నుంచి 60 టన్నుల బరువుతో లోడు ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇరిగేషన్, గోదావరి కన్సర్‌జెన్సీ అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు ప్రస్తుతం వర్షాలు మొదలయ్యాయి. కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు ఏటిగట్టుపై ఉన్న గోతుల్లో నీరు చేరి కాలువల్లా దర్శనమిస్తున్నాయి. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు.

రోజుకు రెండు వేల ఇసుక లారీల రాకపోకలు..

ఏటిగట్టు రోడ్డులో నిడదవోలు మండలంలో పందలపర్రు, జీడిగుంట, పెరవలి మండలంలో కానూరు, తీపర్రు, కాకరపర్రు, మల్లేశ్వరం గ్రామాల వద్ద ర్యాంప్‌ల నుంచి నిత్యం 2 వేలకు పైగా ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి వలన ఏటుగట్టు మరింత అధ్వానంగా తయారయ్యిందని దీని వలన గోదావరి వరదల సమయంలో ఏటిగట్టుకు ఏమైనా ప్రమాదం జరుగుతుందని ప్రజలు భయపడుతున్నారు. వర్షాలు వలన ఏటిగట్టు బురదమయంగా గోతులు, రాళ్లు లేచి ఉండడంతో కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవస్థలు పడాల్సి వస్తోందని ప్రయాణికులు అంటున్నారు.

ప్రమాదమే..

1986లో వచ్చిన వరదల వలన ఖండవల్లి నుంచి మల్లేశ్వరం వరకు కేవలం రెండు కిలోమీటర్ల పరిధిలో ఏటిగట్టుకు నాలుగు చోట్ల గండ్లు పడి ఈ ప్రాంతాన్ని ముంచెత్తింది. ఆ నాటి నుంచి గోదావరికి ఎప్పుడు వరదలు వచ్చిన తీరప్రాంత ప్రజలు హడలిపోతున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ముఖ్యమంత్రి అయిన వెంటనే గోదావరి ఏటిగట్లు పటిష్ట పరిచి ఎత్తు పెంచారు. 2015లో చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకురావడంతో ఏటిగట్టుకి కష్టాలు ప్రారంభమయ్యాయి. నేటికీ ఏటిగట్టును పటిష్ట పరచలేదు. ప్రస్తుతం ఏటిగట్టు ప్రమాదకరంగా మారిపోయింది.

భారీ వాహనాలు తిరగడంతో..



ఏటిగట్టు ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇసుక లారీలు, భారీ వాహనాలు తిరగడం వలన మొత్తం పాడైపోయింది. ఎక్కడ పడితే అక్కడ ర్యాంపులు వేశారు. దీని వలన గట్టు తీవ్రంగా దెబ్బతింది. రోడ్డు అధ్వానంగా మారింది.

– సీహెచ్ శ్రీరామ చంద్రమూర్తి, రైతు ఖండవల్లి

వరదలు వస్తే ప్రమాదం



ఇసుక లారీలు, ట్రాక్టర్లు, మట్టి ట్రాక్టర్ల వలన ఏటిగట్టు నాశనమైంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. వర్షాలకు ఏటిగట్టు దిగబడిపోతోంది. వరదలు వస్తే ఏం జరుగుతుందోనని భయంగా ఉంది.

– కె.వెంకట కృష్ణ, లంక రైతు ముక్కామల

గోతులమయం



ఏటిగట్టు అధ్వానంగా ఉంది. ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిన తరువాత వాహనాలు రాకపోకలతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఎక్కడ చూసినా గోతులే. వర్షాకాలంలో ఏటిగట్టు కాలువలా దర్శనమిస్తోంది.

– బోకే వెంకటేశ్వర్లు, లంకమాలపల్లి

చంద్రవరం సర్పంచ్‌కు తలారి పరామర్శ



చంద్రవరంలో సర్పంచ్ శ్రీరామమూర్తిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. చంద్రవరంలో సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి తల్లి మంగమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి, వారి కుటుంబ సభ్యులను తలారి వెంకట్రావు పరామర్శించారు. ఊనగట్లలో బొల్ల పెద పాటియ్య, కాసాని రామచంద్రం ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది అని ఆయన భరోసా ఇచ్చి ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉప్పులూరి సూరిబాబు, పార్టీ ఆర్టీఏ విభాగం జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, నాయకులు గేడా శ్యామ్, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, కుదప రాంబాబు, ఎల్లే నాగేశ్వరరావు, ఉన్నమట్ల బ్రాహ్మనందం తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించండి



వేగేశ్వరపురంలో యోగాంధ్ర అక్షరాల ఆకృతిలో విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి: యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించి ఈ నెల 21న జరుగుతున్న ప్రపంచ యోగా దినోత్సవానికి తరలి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, నోడల్ అధికారులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలందరూ యోగా చేయడం వల్ల శారీరక ధృడత్వంతోపాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.రాజారావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, గ్రామ స్థాయి నోడల్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలో యోగాంధ్ర కార్యక్రమం

తాళ్లపూడి: వేగేశ్వరపురం కేవీఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద గురువారం యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఎంఈఓ సీహెచ్ బాలా మణి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ యోగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది విద్యార్థులతో యోగాంధ్ర అక్షరాల ఆకృతిలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

- పరస్పర ఆరోపణలతో దద్దరిల్లిన సమావేశం
- వాకౌట్ చేసిన సభ్యులు



పెరవలి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ఖండవల్లి, ముక్కామల, కొత్తపల్లి అగ్రహారం, కానూరు అగ్రహారం ఎంపీటీసీ సభ్యులు

పెరవలి: ప్రభుత్వ పథకాల గురించి ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడంలేదని ప్రజాప్రతినిధులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తుంటే ఎవరు మీరు అని అడుగుతున్నారని, సమాచారం అడిగితే చెప్పడంలేదని మండిపడ్డారు. గత సమావేశాల్లో తీసుకువచ్చిన సమస్యలు పరిష్కారం చేశారా, లేదా అంటే మినిట్స్ లేదని చెప్పడంతో సభ్యులు ఆగ్రహించి వాకౌట్ చేశారు. దీంతో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ స్పందించి మినిట్స్ లేకపోవడం ఏమిటని, అసలు అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా అని ఆయన ధ్వజమెత్తారు. అంటూ ఆగ్రహించారు. మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా ప్రతి డిపార్టుమెంట్ అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయంతో పనిచేసి సమాచారం ప్రజా ప్రతినిధులకు ఇవ్వాలని చెప్పినా బేఖతార్ చేయడం దారుణం అని ఎంపీపీ అన్నారు. దీంతో పెరవలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. సభ్యుల ఆగ్రహం, ఆరోపణలతో సమావేశం దద్దరిల్లింది. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి సునీల్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ పథకాలు ప్రజాప్రతినిధులకు తెలియకుండా వేయడం హాస్యస్పదమని, అధికారులు తీరు మార్చుకోవాలని ఆగ్రహించారు. రోడ్లు, పశువుల తొట్టెలు, డ్రైన్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇలా పలు సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ అధికారులు ఎవరైనా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని కాని, ఫోన్ సమాధానం చెప్పకపోయినా ఫిర్యాదులు వస్తే లిఖిత పూర్వకంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి.సునీల్ వినయ్, తహసీల్దార్ కె.నిరంజన్, జెడ్పీటీసీ సభ్యురాలు కె రామాంజని, ఎంపీడీఓ కె.పద్మజ అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి



సమిశ్రగూడెం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి
- ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

నిడదవోలు రూరల్: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిలను స్థానిక సంస్థల ప్రతినిధులు పర్యవేక్షించాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకానికి అనర్హులైన లబ్ధిదారులకు విద్యుత్ యూనిట్ల విషయంలో చాలా సందేహాలు ఉన్నాయని చెప్పారు. అధికారులంతా బాధ్యతగా పని చేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా కృషిచేయాలన్నారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జూలై, ఆగస్టులో ఎర్రకాలువ ముంపుతో నష్టపోయిన రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ప్రజాప్రతినిధుల సమన్వయంతో వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందించాలన్నారు. కంసాలిపాలెం ఎంపీటీసీ వీరప్రసాద్ మాట్లాడుతూ తల్లికి వందనంతో ఆయా సంక్షేమ పథకాల్లో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై వివక్ష చూపిస్తున్నారని విమర్శించారు. ప్రతి గ్రామంలో తల్లికి వందనం రాని వారి జాబితాలో వైఎస్సార్ సీపీ శ్రేణులే ఎక్కువగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ శాఖల అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీడీఓ జగన్నాథరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

- నిడదవోలు–పంగిడి రహదారిలో గోతులు పూడ్చాలి
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం
- అభివృద్ధికి సహకరించాలన్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు



చాగల్లులో పాఠశాల సమస్యపై ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుతో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యురాలు గంగాభవాని

చాగల్లు: నిడదవోలు–పంగిడి రహదారిలో గోతులు పూడ్చాలని, పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు – ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విన్నవించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మట్టా వీరాస్వామి అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సర్వ సభ్య సమావేశం ఎంపీడీవో ఎ.శ్రీదేవి కొనసాగించారు. ఈ సమావేశంలో నిడదవోలు–పంగిడి రహదారిలో ఏర్పడ్డ గోతులతో ప్రయానికులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో పలువురు సభ్యులు ప్రశ్నించారు. ప్రధానంగా సీసీరోడ్లు, బీటీ రోడ్డు కలయికలో ఈ గోతులు ఎక్కువగా ఉన్నాయని సభ్యులు ధ్వజమెత్తారు. చాగల్లులో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ ఇంటి కృష్ణవేణి కోరారు. చిక్కాల, చిక్కాల పాలెం గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎన్నో సార్లు విజ్ఞప్తి చేసిన ఆర్టీసీ అధికారులు స్పందించడం లేదని ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు అన్నారు. ఎస్.ముప్పవరం గ్రామంలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మడు కోరారు. చాగల్లు పాటమ్మ పేటలో ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను ఎంఈవో కార్యాలయంలో ఉన్న పాఠశాలకు మిర్జ్ చేయడం తగదని, ఇక్కడ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ సానబోయిన అర్జునుడు విద్యాశాఖ అధికారులను నిలదీశారు. మండలంలో పలు సమస్యలు చర్చించారు. అనంతరం వివిధ శాఖల అధికాలతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూ ఎస్. విద్యుత్, గృహనిర్మాణ, పంచాయతీ రాజ్, ఆరోగ్యం, రెవెన్యూ, వెలుగు, హార్టీకల్చర్, విద్యాశాఖ తదితర శాఖల పరిధిలోని పలు అంశాలను సమావేశంలో వివరించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు అడ్డుపడితే సహించేది లేదన్నారు. అందరూ అభివృద్ధికి సహకరించాలన్నారు.ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల నాని, తహసీల్దార్ ఎం. మెరికమ్మ, ఎంపీటీసీలు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఎస్‌కె పాషా, ఉన్నమట్ల విజయకుమారి, సర్పంచులు కుదప రాంబాబు, ఉన్నమట్ల మనశ్శాంతి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందించాలి

నిడదవోలు: పట్టణంలోని తీరుగూడెంలో 2014– 19 సంవత్సరంలో సుమారు 1250 మంది కుటుంబాలకు నిర్మించిన టిడ్కో గృహలను లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ టీడీపీ నాయకుడు, బాబూ జగ్జీవన్‌రాయ్ సేవా సమితి అధ్యక్షుడు బైపే రాజేశ్వరరావు గురువారం ఎంపీ పురందేశ్వరికి వినతి పత్రం అందించారు. పట్టణంలోని (హెచ్‌ఎఫ్‌ఏ)అందరికీ ఇల్లు పథకం కింద గృహ నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్న 115 మంది లబ్ధిదారులకు మంజూరు చేయాలని ఎంపీని ఆయన కోరారు.

మినిట్స్ బుక్‌లో సమస్యలు రాస్తున్నారా?

అధికారులను ప్రశ్నించిన ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి



ఉండ్రాజవరం మండల సమావేశంలో ఎంపీడీవో రామారావును ప్రశ్నిస్తున్న ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి

ఉండ్రాజవరం: గత సమావేశంలో ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించారా అని ఎంపీడీవో వి.రామారావును ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి ప్రశ్నించారు. ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను మినిట్స్ బుక్‌లో రాయాలని అధికారులకు సూచించారు. కాని అధికారులు పాటించడం లేదన్నారు. దీనిపై ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ సభ్యులు అడిగిన సమస్యలను రాసుకున్నామని తెలిపారు. పసలపూడి నీటి సంఘం అధ్యక్షుడు బలుసు వెంకటరత్నం మాట్లాడుతూ రెవెన్యూలో చాలా సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రీసర్వే కారణంగా పంచేసుకున్న ఆస్తులు కూడా అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. అలాగే 40, 50 ఏళ్ల క్రితం రిజిస్ట్రేషన్ అయిన భూములు కూడా ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఈనాం భూములుగా చూపిస్తున్నాయని, దీనిపై ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదని అధికారులపై మండిపడ్డారు. డీటీ కనకదుర్గ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా టెక్నికల్ సమస్యల పరిష్కరం తమ చేతుల్లో లేదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ షాజహాన్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకంలో అర్హులను, కరెంట్ బిల్లుల సాకుతో అనర్హులు చేసారని, సచివాలయాలు, కరెంట్ ఆఫీస్‌ల చుట్టు తిప్పించుకుంటున్నారని వాపోయారు. అనంతరం మిగిలిన శాఖ మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజ, ఈవోపీఆర్డీ అంజనేయ శర్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.